

అంజన్న సేవలో మాజీ ఎంపీ

కొండగట్టు: కొండగట్టు అంజన్నను గురువారం కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. అర్చకులు ఆయన గోత్రనామాలపై ప్రత్యేక పూజలు చేశారు.



పెద్దమ్మతల్లి బోనాలు

కోరుట్ల రూరల్ : మండలంలోని చిన్నమెట్‌పల్లి, మోహన్‌రావుపేట గ్రామాల్లో గురువారం ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/28.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పురుషోత్తమ భారతీ స్వామిజీకి ఘన స్వాగతం



ధర్మపురికి చేరుకున్న స్వామిజీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి పుణ్యక్షేత్రానికి గురువారం రాత్రి చేరుకున్న శ్రీ శృంగేరి శివగంగ పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ పురుషోత్తమ భారతీ స్వామిజీకి ఘన స్వాగతం పలికారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణలతో స్థానిక నంది కూడలి నుంచి ఆలయం వరకు మేళ తాళాల మధ్య స్వామిజీని తీసుకెళ్లారు. ముందుగా నిత్యపూజలో భాగంగా శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శారదాచంద్రమౌళీశ్వర పూజ నిర్వహించారు. అనంతరం స్థానిక బ్రాహ్మణ సంఘంలో విశ్రాంతి తీసుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్, రేనవేషన్ కమిటీ చైర్మన్ ఇందారపు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని దివ్యాంగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న దివ్యాంగులు

కోరుట్ల: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నియోజకవర్గ దివ్యాంగుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. తమకు ప్రతినెలా రూ.10 వేల పింఛన్, ఇల్లు లేని దివ్యాంగులకు డబుల్ బెడ్ రూం, ఎలాంటి విద్యార్హత లేకున్నా మోటార్ సైకిల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితబంధు మాదిరిగా దివ్యాంగ బంధు పథకం పెట్టి రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. విద్యార్హతల ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ప్రతినెలా నియోజకవర్గ కేంద్రంలో సదరం క్యాంపు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో నియోజక వర్గ దివ్యాంగ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో అమరుల దినోత్సవం



మౌనం పాటిస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాలలో గురువారం తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులు, ప్రొఫెసర్లు 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి భట్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

కట్లకుంటకు బస్సు సౌకర్యం కల్పించండి

కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి మండలం కట్లకుంట గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ట్విట్టర్ ద్వారా ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు గ్రామస్తులు విన్నవించారు. సుమారు రెండు నెలలుగా గ్రామానికి బస్సు సౌకర్యం లేక ఇబ్బందిపడుతున్నామని పేర్కొన్నారు. స్పందించిన ఎండీ సజ్జనార్ ఈవిషయంలో విచారణ చేయాలని జగిత్యాల డిపో మేనేజర్ వెంకటనర్సప్పను ఆదేశించారు. ఈ విషయమై జగిత్యాల డిపో మేనేజర్ వెంకటనర్సప్ప వివరణ ఇస్తూ.. కట్లకుంట రూట్ ఇన్నాళ్లు కోరుట్ల డిపో పరిధిలో ఉండేదని, ఇటీవలే ఈ రూట్‌ను జగిత్యాల డిపో పరిధిలోకి మార్చడం వల్ల బస్సు సౌకర్యం కల్పించడంలో జాప్యం జరిగిందన్నారు. రెండు రోజుల్లో కట్లకుంట గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు సీఐలకు పదోన్నతి

జగిత్యాలక్రైం: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు సీఐలకు గురువారం పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎస్బీలో పనిచేస్తున్న రాజశేఖర్‌రాజు, డీసీఆర్‌బీలో పనిచేస్తున్న శ్రీనివాస్‌లకు సీఐ నుంచి డీఎస్పీ పదోన్నతి కల్పిస్తూ డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

సర్వర్ బిజీ.. నెట్ స్లో

మీసేవ కేంద్రాల్లో నిర్వాహకుల దోపిడీ

- పలు సెంటర్లలో నిర్వహణ లోపం
- వసతులు కరువు
- కొరవడిన పర్యవేక్షణ

> ఇటీవల జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇల్లు మారడంతో ఆధార్‌కార్డు అడ్రస్ మార్పు కోసం రెసిడెన్సీ సర్టిఫికెట్ అవసరం ఏర్పడింది. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాసి మీసేవలో అందజేశారు. వారు వాటిని ఆన్‌లైన్ చేశారు. రూ.45 ఫీజుకు అదనంగా రూ.50 వసూలు చేశారు.
>
> జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సహాయం పథకం కోసం ఆదాయం, రెసిడెన్సీ సర్టిఫికెట్‌కు మీసేవలో దరఖాస్తు చేశాడు. కాగా మీసేవ నిర్వాహకులు సర్వర్ బిజీ, నెట్ స్లో అని చెప్పుకొచ్చారు. అదనంగా డబ్బులు చెల్లించడంతో వెంటనే ప్రాధాన్యం ఇచ్చారు.



జిల్లాలోని ఓ మీసేవ కేంద్రం వద్ద రద్దీ

జగిత్యాల: ప్రజలకు పారదర్శక సేవలందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కాగా జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మీసేవ కేంద్రాల నిర్వహణ ఇష్టారాజ్యంగా మారింది. వాటిపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అందినకాడికి డబ్బులు వసూలు చేస్తున్నారు. జిల్లాలో 170 వరకు మీసేవ కేంద్రాలున్నాయి. ప్రస్తుతం ప్రతి ఒక్కరికి ధ్రువీకరణపత్రాలు, తదితర సర్టిఫికెట్ల కోసం ఏదైనా మీసేవ సెంటర్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మీసేవ సెంటర్‌లో సుమారు 300 సేవలు అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా రెవెన్యూ, విద్యుత్, రిజిస్ట్రేషన్ తదితర సేవలను ఇందులో అందిస్తుంటారు.

వసతులు శూన్యం

మీసేవ సెంటర్లలో అందించే సేవలు, వాటి ఫీజుల వివరాల బోర్డులు అందుబాటులో ఉండాలి. కానీ కొన్ని కేంద్రాల్లో బోర్డులే పెట్టడం లేదు. కొన్ని కేంద్రాలను చిన్నచిన్న గదుల్లో ఏర్పాటు చేస్తున్నారు. కనీసం ప్రజలు కూర్చునేందుకు కుర్చీలు, మంచినీటి వసతి కల్పించడం లేదు. అత్యధికంగా మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న సేవల ఫారాలు లేకపోవడంతో డబ్బులు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి మీసేవ సెంటర్ దరఖాస్తును రిజిష్టర్‌లో నమోదు చేయాల్సి ఉన్నా అలా చేయడం లేదు. వారి ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు.

నిబంధనలు తూచ్

సర్వర్ బిజీ అని, నెట్ స్లోగా ఉందని వినియోగదారులను మీసేవ చుట్టూ తిప్పుతున్నారు. కేంద్రాల్లో జనరేటర్ లేకపోవడంతో తరుచూ విద్యుత్ సమస్య నెలకొంటుంది. అత్యధికంగా లావాదేవీలు జరిగే కేంద్రాల్లో 3–4 కంప్యూటర్లు, ఆపరేటర్లు ఉండాలి. కానీ ఒక్కరే ఉంటున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెంటర్ నిర్వహించాల్సి ఉండగా, నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కనీస నిబంధనలు పాటించడం లేదు. సర్వర్ బిజీ అంటూ అమాయక ప్రజల వద్ద అత్యధికంగా డబ్బు గుంజుతున్నారు.

పర్యవేక్షణ లోపం

ఇటీవల ప్రభుత్వం కొన్ని బీసీ కులాలకు రూ.లక్ష ఆర్థిక సహాయం పథకం ప్రవేశపెట్టింది. దీంతో అర్హులకు ఆదాయం, నివాసం సర్టిఫికెట్లు అవసరం కావడంతో అనేక మంది మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. వీటితో పాటు విద్యార్థులు చదువుల నిమిత్తం వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు మీసేవ నిర్వాహకులు ఎక్కువ డబ్బు వసూలు చేస్తున్నారు. ఒక ధ్రువీకరణ పత్రానికి ఎంత డబ్బు అవసరమో అర్జిదారు దరఖాస్తు చేసుకున్న అనంతరం వారి మొబైల్‌కు మెస్సేజ్ వస్తుంది. కాగా రూ.40 ఉంటే రూ.50, రూ.100 ఉంటే రూ.150 ఇలా నిర్వాహకులు అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్లనే నిర్వాహకులు తీసుకోవాలి. కొన్ని సందర్భాల్లో నిర్వాహకులు సామాన్యుడికి సర్వర్ బిజీ అని చెబుతూ అత్యధికంగా డబ్బులు చెల్లిస్తే వెంటనే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒకేరోజులో ఆదాయ, ఈసీలు, ఇతర ధ్రువీకరణ పత్రాలు అత్యధికంగా జారీ చేస్తున్నారు.

నిర్వహణ సరిగా లేకుంటే చర్యలు

మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. తప్పకుండా రికార్డులు నమోదు చేయాలి. సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే డబ్బులు తీసుకోవాలి. ప్రతి చోట తనిఖీలు చేపడతాం.

– మమత, ఈడీఎం

అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండ



స్తూపం వద్ద అమరుల కుటుంబాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు

- మంత్రి కొప్పుల ఈశ్వర్



నివాళి అర్పిస్తున్న మంత్రి ఈశ్వర్, ప్రజాప్రతినిధులు, అధికారులు

జగిత్యాల: అమరవీరుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం ఉంటుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నివాళులర్పించి వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం జరిగిందన్నారు. తెలంగాణ కోసం తొలిదశలో 300 మంది పోరాటంలో పాల్గొని అమరులయ్యారన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు, సంస్కృతి, ఆత్మగౌరవం కోసం ఉద్యమం కొనసాగించడం జరిగిందని, ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో పోరాటం సాగించి తెలంగాణ సాధించుకున్నామన్నారు. ప్రజా ఉద్యమాలు, త్యాగాల ఫలితంగానే తెలంగాణ ఆవిర్భవించిందన్నారు. అనంతరం గాలిలో పావురాలు ఎగురవేశారు. తర్వాత జిల్లా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరిస్తూ 21 రోజుల పాటు దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. జిల్లాలోని 36 మంది అమరవీరుల కుటుంబాలను సత్కరించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్లు మంద మకరంద, లత, జెడ్పీ సీఈవో రామానుజచారి తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల ప్రజాజీవితంలో మచ్చలేకుండా గడిపా

జగిత్యాల: ధర్మపురి ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తనపై అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని, 30 ఏళ్ల ప్రజాజీవితంలో మచ్చ లేని జీవితం గడిపానని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. ఎన్నికల రీకౌంటింగ్ విషయంలో తనపై అడ్లూరి ఎన్నో ఆరోపణలు చేస్తున్నారని, కోర్టు తీర్పు అనంతరం అడ్లూరి లక్ష్మణ్‌పై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రక్రియ రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్ పరిధిలో ఉందని, ఎన్నికల కమిషన్ పూర్తి స్వయం ప్రతిపత్తి గల సంస్థ అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 2018 ఎన్నికల్లో నిబంధనల ప్రకారమే ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంలను ధర్మపురి కాలేజీలో భద్రపరిచి అక్కడ నుంచి పోలీసు బందోబస్తు మధ్య వీఆర్‌కే కళాశాలకు తరలించడం జరిగిందన్నారు. లక్ష్మణ్‌కుమార్ అనుమానించిన 10 బూత్‌ల్లో ఎలాంటి తేడాలు లేవన్నారు. ధర్మపురి ఎన్నిక ఫలితాలకు సంబంధించిన ఎక్కడైనా సరే చర్చించుకుందామని సవాల్ విసిరారు. ఎన్నికకు సంబంధించిన సీసీకెమెరా ఒరిజినల్ ఫుటేజీలు నీవద్దే ఉన్నాయని, కోర్టులో సమర్పించి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ తాళాలు తన చేతిలో ఉన్నాయనడం విడ్డూరమని, ప్రజాస్వామ్యం, న్యాయ వ్యవస్థపై ఏమాత్రం గౌరవం ఉన్నా తీర్పు త్వరగా వచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు నైతికత ఉంటే రాజీనామా చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న జీవన్‌రెడ్డి



దశాబ్ది దగా నిరసనలో కాంగ్రెస్ శ్రేణులు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: తెలంగాణ ఏర్పాటుతో ఉద్యమ ఆకాంక్షలు నెరవేరకపోగా, మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, సీఎం కేసీఆర్‌కు ఏమాత్రం నైతికత ఉన్నా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీపీసీసీ పిలుపు మేరకు దశాబ్ది దగా పేరుతో గురువారం జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు పట్టణంలోని ఇందిరాభవన్ నుంచి ర్యాలీగా బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు ప్రభుత్వ వైఫల్యాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ తహసీల్ చౌరస్తాకు చేరుకుని నిరసన తెలిపారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ప్రజాసంక్షేమాన్ని మరిచారని ఆరోపిస్తూ సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ నీళ్లు, నిధులు, నియామకాల అమలు విషయంలో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. కమీషన్ల కోసమే ప్రాజెక్టులు నిర్మించి లక్షలాది రూపాయల ప్రజాధనం దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పబ్లిక్ కమిషన్ నియామకాల లీకేజీపై ప్రశ్నిస్తే చలనం లేదన్నారు. ధాన్యం సేకరణలో రైతుల కష్టాన్ని మిల్లర్ల పేరుతో దోచుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వరితో పాటు మొక్కజొన్నకు రూ.500 మద్దతు ధర ఇస్తామని ప్రకటించారు. మద్యం విక్రయాల్లో తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో ఉందని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్‌ను నమ్మితే మరో నూరేళ్లు వెనక్కి పోవడం ఖాయమన్నారు. పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, కార్యదర్శి బండ శంకర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, బల్దియా ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య, నాయకులు గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, గుండ మధు, రఘువీర్‌గౌడ్, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు

- నడిబొడ్డున కొత్త తహసీల్ కార్యాలయం
- వారం క్రితం భూమిపూజ
- పాతికేళ్లుగా తిప్పలు
- త్వరితగతిన పనుల పూర్తికి డిమాండ్



గంగారాజం

> పాతికేళ్లుగా ప్రతీ సర్టిఫికెట్‌కు తహసీల్ ఆఫీసుకు వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరం పోవాలి. ఒకటికి నాలుగు సార్లు తిరిగితే పని అవుతుండే. మోటార్ సైకిల్ లేనివాళ్లు రూ. 100 ఖర్చు చేసి ఆటోల్లో వెళ్లాల్సిందే. ఇప్పుడు ఎస్సారెస్పీ క్వార్టర్లలో తహసీల్ ఆఫీసు కట్టడానికి భూమి పూజ చేసిండ్రట. జల్ది కడితే తిప్పలు తప్పుతాయ్.. ఇది కోరుట్లకు చెందిన గంగారాజం ఆవేదన.



ఇటీవల కొత్త తహసీల్దార్ కార్యాలయానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

పనులు త్వరగా పూర్తి చేస్తాం



> పట్టణం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఆదర్శనగర్‌లో ఉన్న తమసీల్దార్ కార్యాలయం ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని నిర్ణయించాం. ఈ మేరకు భవనం కోసం రూ. 30 లక్షల నిధులతో వారం క్రితం భూమిపూజ చేశాం. మిగిలిన రూ. 1.20 కోట్లు నిధులు త్వరలో మంజూరు చేసి పనులు తొందరగా పూర్తి చేస్తాం.
>
> – కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే, కోరుట్ల

కోరుట్ల: కోరుట్లవాసులు ఎన్నాళ్లుగానో తహసీల్దార్ కార్యాలయం ఊళ్లోకి మార్చాలని కోరుతూనే ఉన్నారు. ఈ ఆకాంక్షపై ఇప్పుడు ఆశలు చిగురిస్తున్నాయి. వారం క్రితం పట్టణంలోని ఎస్సారెస్పీ స్థలంలో తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం కోసం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్యలు భూమి పూజ చేశారు.

పాతికేళ్ల తిప్పలు

1998లో కోరుట్లలోని మద్దుల చెరువు సమీపంలోని రియల్ ఎస్టేట్ చేసిన ఓ రియల్టర్ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం ఎకరం స్థలం విరాళంగా ఇచ్చారు. అనంతరం అక్కడే తమసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల నిర్మాణం పూర్తి చేశారు. ఆ స్థలం పట్టణానికి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఆ సమయంలో ప్రభుత్వ కార్యాలయాలను మద్దుల చెరువు సమీపంలో ఏర్పాటు చేయటంపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఆ తరువాత కాలంలోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయినా ఆ సమయంలో ప్రజాప్రతినిధులు అక్కడే కార్యాలయాలు నిర్మించడానికి మొగ్గు చూపారు. ఫలితంగా తహసీల్దార్, మండల పరిషత్ కార్యాయాలు మద్దుల చెరువు వద్ద ఏర్పాటు అయ్యాయి. దీంతో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో అవసరాల కోసం వెళ్లాల్సిన వారు మూడు కిలోమీటర్లు వెళ్లడం అక్కడ సరైన సమయంలో పనులు కాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. మహిళలు, వృద్ధులు వెళ్లడానికి ఆటోల కోసం ఖర్చు చేయడం సమస్యగా మారింది. అప్పటి నుంచి కనీసం తహసీల్దార్ కార్యాలయం మార్చాలని కోరుతూ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి.

రూ.కోటిన్నరతో పనులు

కోరుట్లలోని ఎస్సారెస్పీకి సంబంధించి 6 గుంటల స్థలంలో రూ. కోటిన్నర వ్యయంతో కొత్త కార్యాలయం నిర్మాణానికి సంకల్పించారు. ప్రస్తుతం మొదటి దఫాగా తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం కోసం రూ.30 లక్షలు మంజూరు చేశారు. పనులు మొదలు కాగానే మిగిలిన నిధుల కేటాయింపుకు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు భూమిపూజ సందర్భంగా తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ అధ్వర్యంలో పనులు కొనసాగనున్నాయి. సుమారు ఆరు నెలల వ్యవధిలో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో త్వరితగతిన తహసీల్దార్ కార్యాలయ పనులు పూర్తి అవుతాయన్న ఆశలు ప్రజల్లో చిగురిస్తున్నాయి.

ఐదేళ్లు గడిచినా తట్టెడు మట్టి పోయలే..



నిరసన తెలుపుతున్న ఆది శ్రీనివాస్, నాయకులు

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్, మేడిపెల్లి మండలాలకు సాగునీరందించే సూరమ్మ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ పనులకు భూమిపూజ చేసి ఐదేళ్లు గడిచినా తట్టెడు మట్టి పనులు చేయపోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. గురువారం కథలాపూర్ మండలం కలిగోట శివారులో సూరమ్మ ప్రాజెక్టు కాలువ పనుల శిలాఫలకం వద్ద నాయకులతో కలిసి గుమ్మడి కాయలు, కొబ్బరి, మిరపకాయలతో దిష్టితీసి నిరసన తెలిపారు. అప్పట్లో పనుల ప్రారంభోత్సవాలకు హాజరైన మంత్రులతోపాటు వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేరిట దిష్టితీసి గుమ్మడికాయలు కోసి కొబ్బరికాయలు కొట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. పాలకులకు ఇకనైనా బుద్ధిప్రసాదించి పనులను ప్రారంభించేలా చూడాలని దేవుడిని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మొద్దునిద్ర వీడి కథలాపూర్, మేడిపెల్లి మండలాలకు సాగునీరందించే పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గసభ్యుడు తొట్ల అంజయ్య, పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీమ్, పులి హరిప్రసాద్, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, కల్లెడ గంగాధర్, మార్క రాజేశం, ఆకుల సంతోష్, తిరుపతినాయక్, లింగంగౌడ్, శ్రీహరి, కృష్ణచారి తదితరులు పాల్గొన్నారు.

రథయాత్రకు ఘన స్వాగతం





కోరుట్ల: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ ఇస్కార్ టెంపుల్ ఆధ్వర్యంలో చేపట్టిన జగన్నాథ రథయాత్ర గురువారం రాత్రి కోరుట్ల పట్టణానికి చేరుకోగా స్థానికులు ఘన స్వాగతం పలికారు. మహిళల నృత్యాలు, భక్తుల హరే రామ, హరే కృష్ణ భజనలు, కీర్తనలతో యాత్ర వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమై ఐబీ రోడ్, నంది చౌరస్తా, కొత్త బస్టాండ్, గాంధీ రోడ్ మీదుగా తిరిగి ఆలయం వద్దకు చేరింది. అనంతరం వాసవి కల్యాణ భవనంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, శ్రీనివాసదాసు, ప్రేమానందు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నియామకం

జగిత్యాలజోన్: జిల్లా లీగల్ ఎయిడ్స్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులుగా ముగ్గురు న్యాయవాదులను నియమించారు. ఇందులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడిగా న్యాయవాది కట్కం చంద్రమోహన్, డెప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడిగా న్యాయవాది పొట్టవత్తిని సతీశ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడిగా న్యాయవాది రాచకొండ విజయ్‌కృష్ణ నియమితులయ్యారు. ఆర్థికస్థోమత లేనివారి కేసులను వీరు వాదిస్తారన్నారు.

సబ్ కలెక్టర్‌ను నియమించాలి

మెట్‌పల్లి: మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్‌ను నియమించాలని కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు అందె మారుతి గురువారం డిమాండ్ చేశారు. రెండేళ్లుగా కోరుట్ల ఆర్డీవోను ఇన్‌చార్జీగా నియమించడంతో ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం నియోజకవర్గంలో రెండు డివిజన్లను ఏర్పాటుచేసిన ప్రభుత్వం.. ఒక్క అధికారికే రెండు చోట్ల విధులు అప్పగించడం సరికాదన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మెట్‌పల్లికి సబ్ కలెక్టర్‌ను నియమించాలన్నారు.

ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతంలో గురువారం రాత్రి జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టారు. స్థానికుల వివరాలు.. కోరుట్ల నుంచి జగిత్యాల వస్తున్న బస్సు మంచినీళ్ల బావి వద్ద ఆపుతుండగా, గుర్తు తెలియని వ్యక్తులు అద్దాలను ధ్వంసం చేసి పారిపోయారు.

కుక్కల దాడిలో ఆవు మృతి

సిరిసిల్లఅర్బన్: చిన్నబోనాలలో గురువారం వీధికుక్కల దాడిలో ఆవు మృతిచెందింది. గోస్కుల పర్శరాములుకు చెందిన ఆవును ఇంటికి సమీపంలో కట్టి ఉంచాడు. గుంపులుగా వచ్చిన వీధికుక్కలు ఆవుపై దాడి చేయగా ఆవు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కుక్కల బెడద నుంచి కాపాడాలని మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌కు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ బొల్గం నాగరాజ్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుత్ వైరు చోరీ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ వైకుంఠధామం పరిసరాల్లో బోరు మోటార్‌కు సంబంధించిన విద్యుత్ వైరు చోరీ జరిగినట్లు సర్పంచ్ బూర్గుల నందయ్య గురువారం తెలిపారు. గుర్తుతెలియని దొంగలు విద్యుత్ వైర్లు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో పోలీసులకు సమాచారం అందించినట్లు వివరించారు. ఇప్పటికే రెండుసార్లు విద్యుత్ వైరు చోరీ జరిగిందని ఇది మూడోసారి అని సర్పంచ్ నందయ్య తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో..



వేములవాడఅర్బన్: వేములవాడ మండలం సంకెపల్లిలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఆలయంలోని హుండీని బయటకు తీసుకెళ్లి నగదు తీసుకుని హుండీని ఆలయ పరిసరాల్లో పడేశారు. ఇటీవల ఎల్లమ్మ సిద్ధోగం జరిగిందని అందులో భారీ మొత్తంలో నగదు ఉందని గౌడ కులస్తులు పేర్కొంటున్నారు. దొంగలను పట్టుకోవాలని కోరుతూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, క్లూస్‌టీమ్‌తో ఆధారాలు సేకరించారు.

భూసార పరీక్షలకు మంగళం

- జిల్లాలో ఒక్క భూసార పరీక్షా కేంద్రం లేదు
- సిబ్బంది లేరు..రసాయనాలు లేవు



భూసార పరీక్షలకు సంబంధించిన దృశ్యం

జగిత్యాలఅగ్రికల్చర్: పంటల సాగులో రైతులు రసాయన ఎరువులను ఇష్టారాజ్యంగా వేస్తుండడంతో వ్యవసాయ భూములు పనికి రాకుండా పోతున్నాయని శాస్త్రవేత్తలు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. భూసార పరీక్షల ఆధారంగా రసాయన ఎరువులు వేస్తే, రైతులకు ఖర్చు తగ్గడంతో పాటు భూములు చెడిపోకుండా ఉంటాయని, పర్యావరణానికి హాని ఉండదని ప్రభుత్వం సూచిస్తోంది. అయితే, జిల్లాలో భూసార పరీక్షలు నిర్వహించే పరీక్షా కేంద్రాలు లేక రెండేళ్లుగా రైతులు భూసార పరీక్షలకు నోచుకోవడం లేదు.

జిల్లాలో భూసార పరీక్షా కేంద్రాలు లేనట్లే..

జిల్లాలో జగిత్యాల, మెట్‌పల్లిలో మార్కెట్‌యార్డులో భూసార పరీక్షా కేంద్రాలు ఉండేవి. పరీక్షా కేంద్రాలకు అవసరమైన రసాయనాల కోసం ఏడాదికి రూ.20 నుంచి 30వేలు ఆయా మార్కెట్‌యార్డుల నుంచి ఇచ్చేవారు. ఈ కేంద్రాల్లో పరీక్షలు చేసేందుకు వ్యవసాయాధికారులతో పాటు సిబ్బంది ఉండేవారు. కానీ కొంతకాలంగా ఈ భూసార పరీక్షా కేంద్రాల్లో సిబ్బంది లేక, జగిత్యాలలోని భూసార పరీక్షా కేంద్రాన్ని సమీకృత మార్కెట్ నిర్మాణంలో భాగంగా కూల్చివేశారు. మెట్‌పల్లిలోని భూసార పరీక్షా కేంద్రం పత్తా లేకుండా పోయింది. దీంతో, భూసార పరీక్షలు నిలిచిపోవడంతో, రైతులకు సేవలు అందకుండా పోయాయి.

మినీ భూసార పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినా

అగ్రికల్చర్ క్లస్టర్ల వారీగా ఏఈవోలను నియమించిన తర్వాత మినీ భూసార పరీక్షా కేంద్రాలను ఆయా క్లస్టర్లలో ఏర్పాటుచేశారు. రైతువేదికలు ఏర్పాటు చేయక ముందు గ్రామపంచాయతీ లేదా ప్రభుత్వ భవనాల్లో ఏర్పాటు చేసినప్పటికీ, వాటితో పెద్దగా ప్రయోజనం లేకపోయింది. దీనికి తోడు మినీ భూసార పరీక్షా కేంద్రాలకు భూసార కిట్లు ఇచ్చినప్పటికీ, అందులోని రసాయనాలు పనిచేయకపోవడంతో అవిసైతం మూలన పడ్డాయి. అయితే, కరోనాకంటే ముందు ప్రభుత్వం జిల్లాకు 5వేల వరకు భూసార పరీక్షలు చేయాలని లక్ష్యం నిర్ణయించి గ్రామాల నుంచి రైతులు తీసుకవచ్చే మట్టి నమూనాలను కరీంనగర్‌కు పంపించేవారు. కరీంనగర్‌కు పంపించినప్పటికీ, వాటి ఫలితాలు రైతులు పంటలు వేసిన తర్వాత, ఎప్పుడో వచ్చేవి. అవిసైతం రైతులకు పెద్దగా ఉపయోగం లేకుండా పోయాయి.

అవసరమైన రైతులు పొలాసకు..

ఉద్యాన పంటలను పెద్దమొత్తంలో సాగుచేసే జిల్లా రైతులు మాత్రం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం లేదంటే పొలాస వ్యవసాయ కళాశాలకు తీసుకెళ్లి మట్టి పరీక్షలు చేయించుకుంటున్నారు. పొలాస శాస్త్రవేత్తలు మాత్రం వారి నిబంధనల మేరకు కేవలం దత్తత గ్రామ రైతులకు ఉచితంగా పరీక్షలు చేస్తుండగా, మిగతా రైతులకు రూ.150 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో చిన్న, సన్న కారు రైతులు కాకుండా కేవలం అవసరమైన రైతులు మాత్రమే భూసార పరీక్షలు చేయించుకుంటున్నారు. పంటలు తీసిన తర్వాత, భూములు ఖాళీగా ఉన్న సమయంలో మట్టి నమూనాలు తీసి, మట్టి పరీక్షలు చేయించాల్సి ఉండగా, ప్రభుత్వం భూసార పరీక్షలపై పెద్దగా దృష్టి పెట్టకపోవడం, రసాయనాలకు అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో, వ్యవసాయాధికారులు సైతం భూసార పరీక్షల పట్ల పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

కేంద్రం ఎక్కడుందో తెలియదు



జిల్లాలో భూసార పరీక్షా కేంద్రం ఎక్కడుందో రైతులకే తెలియదు. జగిత్యాలలోని భూసార పరీక్షా కేంద్రాన్ని మార్కెట్ నిర్మాణంలో భాగంగా కూల్చివేశారు. ఇప్పుడు భూసార పరీక్షలు ఎక్కడ చేయించుకునుడో రైతులకు అర్థం కావడం లేదు.

– సత్యం రెడ్డి, రైతు సంఘం నాయకుడు, మెట్‌పల్లి

కరీంనగర్‌కు పంపిస్తున్నాం



జిల్లాలో గతంలో రెండు భూసార పరీక్షా కేంద్రాలు ఉండేవి కానీ ఇప్పుడు పనిచేయడం లేదు. అందుకు అవసరమైన రసాయనాలు అందుబాటులో లేవు. ఎవరైనా రైతులు మట్టి నమూనాలు తీసుకువస్తే, భూ సార పరీక్షల కోసం కరీంనగర్‌కు పంపిస్తున్నాం. త్వరలో మినీ భూసార పరీక్షా కేంద్రాలను బలోపేతం చేస్తాం.

– పాక సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

- పాత కక్షలతో దాడి..?
- దెబ్బలు తాళలేక చనిపోయాడని ఫిర్యాదు
- డీఎస్పీ విచారణ



సుమన్(ఫైల్)



ఘటన స్థలంలో విచారణ చేస్తున్న డీఎస్పీ

కోరుట్ల: పట్టణంలోని అల్లమయ్యగుట్ట కాలనీలో బుధవారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన కలకలం రేపింది. కాలనీకి చెందిన కొందరు కావాలనే కక్షగట్టి కొట్టిచంపారని మృతుడి భార్య ఫిర్యాదు చేసింది. ఎస్సై కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం..15 రోజుల క్రితం అల్లమయ్యగుట్ట కాలనీలో నివాసిస్తున్న ఇప్ప సుమన్(32) యువకుడికి అదే కాలనీకి చెందిన కోదండం రామచంద్రం (35)అతని తమ్ముడు నారాయణ(32)తో బాకీ డబ్బుల విషయంలో గొడవ జరిగిందన్నారు. సుమన్ తమ వద్ద రూ. 80వేలు అప్పుతీసుకుని ఇవ్వడం లేదని రాంచంద్రం, నారాయణ, సుమన్ వాదులాడుకుని కొట్టుకున్నారు. దీంతో ఇరువర్గాలపై కేసులు నమోదయ్యాయి. ఈక్రమంలో సుమన్ బుధవారం రాత్రి 11గంటల సమయంలో గంగమ్మ పండుగ చేసుకున్న రాంచంద్రం, నారాయణ ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. రాత్రి సమయంలో తమ ఇంటికి వచ్చిన సుమన్ నగ్నంగా పరారయ్యాడని తాము డయల్ 100కు కాల్‌చేసినట్లు రాంచంద్రం, నారాయణ తెలిపారు. దీంతో అర్ధరాత్రి అక్కడికి చేరుకున్న పోలీసులు సుమన్ కోసం వెతకగా కల్వర్టు కింద మురుగు కాల్వలో ఉన్నట్లు గుర్తించి బయటకు తీశారు. అనంతరం పోలీసులు సుమన్‌కు స్నానం చేయించి ఇంటికి తీసుకెళ్లి భార్య గంగజలకు అప్పగించారు. ఈ క్రమంలో రాత్రి 2గంటల సమయంలో సుమన్ ఇంటివద్ద మృతిచెందడంతో తన భర్తను రాంచంద్రం, నారాయణ కొట్టడం వల్లే మృతిచెందాడని భార్య గంగజల పోలీసులకు ఫిర్యాదుచేసింది. గురువారం ఉదయం ఘటన స్థలాన్ని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై కిరణ్ పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నామని ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

ప్రాణాలు కాపాడిన డయల్ 100

- బాధితున్ని ఆస్పత్రిలో చేర్పించిన కానిస్టేబుల్, హోంగార్డు



బాధితుడితో పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రానికి చెందిన జక్కుల సంతోష్ గురువారం సాయంత్రం గొల్లపల్లి రోడ్డులో ఆత్మహత్యకు పాల్పడేందుకు పురుగుల మందుతాగాడు. వెంటనే బాధితుడు పురుగుల మందుతాగినట్లు డయల్ 100కు సమాచారమివ్వడంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది కానిస్టేబుల్ జుబేద్, హోంగార్డు తిరుపతి ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా బాధితుడి దగ్గరికి వెళ్లి బాధితున్ని జగిత్యాల ప్రభుత్వాస్పత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడారు. బాధితుడికి అప్పులు ఇచ్చిన వారు దుర్భాషలాడడంతో మనస్థాపం చెంది పురుగుల మందుతాగినట్లు తెలిపారు.

ఫారెస్ట్ అధికారులకు నెమలి అప్పగింత



చికిత్స చేస్తున్న వెటర్నరీ డాక్టర్

కోరుట్ల: మెట్‌పల్లి మండలం కోనరావుపేట గ్రామ శివారులో పొలం వద్ద పడిఉన్న నెమలిని అదే గ్రామానికి చెందిన రైతు గురువారం సాయంత్రం ఫారెస్ట్ అధికారులకు అప్పగించాడు. నెమలి అనారోగ్యంగా ఉండటంతో ఫారెస్ట్ అధికారులు వెటర్నరీ డాక్టర్ నాగరాజు వద్దకు తీసెకెళ్లి చికిత్స చేయించారు. ఈసందర్భంగా నెమలిని అప్పగించిన రైతును ఫారెస్ట్ అధికారులు అభినందించారు.

తాటిచెట్ల నరికివేతపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న గీత కార్మికులు

ధర్మపురి: మండలంలోని కమలాపూర్‌లో గీత కార్మికులకు జీవనోపాధి కల్పించే తాటిచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికి వేశారని ధర్మపురిలోని ఎక్సైజ్ కార్యాలయంలో గౌడసంఘం సభ్యులు ఫిర్యాదుచేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రిమిసంహారక మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య



శంకర్‌నాయక్(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం అంబారిపేట గ్రామానికి అనుబంధమైన గిరిజన తండాకు చెందిన గుగులోత్ శంకర్‌నాయక్(74)వృద్ధుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌నాయక్ కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చికిత్సపొందిన నయం కాకపోవడంతో మనస్థాపం చెంది బుధవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వేములవాడకు తరలిస్తుండగా... మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి కుమారుడు జగన్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ...



కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి మండలకేంద్రం శివారులోని ఓ మామిడితోటలో గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చిరంజీవి గురువారం తెలిపారు. మామిడితోటలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు అటువైపు వెళ్లిన గొర్రెల కాపరులు గుర్తించి గ్రామస్తులకు సమాచారమిచ్చారు. గ్రామస్తుల సమాచారంతో ఘటన స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. మామిడితోట యజమాని ఏలేటి లక్ష్మారెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు. మృతుడికి 45 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వాసుపత్రిలోని మార్చురి గదిలో ఉంచామన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సెల్ 8712656792కు సంప్రదించాలని ఎస్సై చిరంజీవి వివరించారు.

అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు

జగిత్యాల: ఇబ్రహీంపట్నం మండలం భర్త్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శ్రీవాణి పాఠశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతోందని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. దీంతో నోటీసులు జారీచేశామని వారం రోజుల్లో వివరణ ఇవ్వకపోతే శాఖపరమైన చర్యలు సుకుంటామన్నారు.

హామీలను తుంగలో తొక్కిన బీఆర్‌ఎస్



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు
- నిరసనలో డీసీసీ అధ్యక్షుడు

ధర్మపురి: సీఎం కేసీఆర్ ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కారని రాష్ట్రంలో ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పీసీసీ పిలుపుతో ధర్మపురి నియోజకవర్గంలో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో దశాబ్ది దగా అనే పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా నంది కూడలి నుంచి గాంధీచౌక్, అంబేడ్కర్ కూడళి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వందలాది మంది కార్యకర్తలు కాంగ్రెస్ జెండాలతో పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. 2014లో ధర్మపురికి వచ్చి యజ్ఞాలు, యాగాలు చేసి ధర్మపురి అభివృద్ధికి రూ.500 కోట్లు ఇస్తానని సీఎం కేసీఆర్ మాట తప్పారన్నారు. దళితున్ని సీఎంగా చేస్తానని, దళితులకు 3 ఎకరాల భూమి, ఇంటికో ఉద్యోగం అన్ని ఉత్తమాటలేనన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ పథకాలు తప్పా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదని అభివృద్ధి చేస్తే చర్చలకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జాతీయ రహదారిపై ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి తహసీల్దార్ వెంకటేశ్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

‘దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృథా’



కేంద్ర పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: తొమ్మిదేళ్లుగా నరేంద్రమోదీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు దోహదపడతాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మున్సిపల్ మాజీ చైర్మన్ భోగ శ్రావణి ఆశాభావం వ్యక్తం చేశారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 168, 169బూత్‌లలో ఇంటింటా తిరుగుతూ కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్న విషయాన్ని దాచిపెడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం పథకాలన్నీ తామే అమలు చేస్తున్నట్లు కుట్రపూరిత ప్రచారం చేసుకోవడం శోచనీయమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రాజెక్టులు, పథకాల పేరిట దోచుకోవడమే కాకుండా భూ, ఇసుక దందాలు చేస్తున్నారని ఆరోపించారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని పార్టీ ప్రచారం కోసం ఖర్చు పెడుతూ వృథా చేయడం దారుణమన్నారు. దేశం, రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వివరించి రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి వచ్చేలా కృషి చేస్తామన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్‌కుమార్, మహిళామోర్చా కార్యదర్శి కళావాతి పాల్గొన్నారు.

కేసీఆర్ పది తలల దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కోరుట్ల: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని కొత్త బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ పది తలల దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు సీఎం కేసీఆర్ ఇచ్చిన పది హామీలతో పది తలల రావణాసుర ఆకారంలో ఉన్న దిష్టి బొమ్మ దహనం చేశామన్నారు. ఇచ్చిన ముఖ్యమైన పది హామీలు మరచి దశాబ్దిఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. టీపీసీసీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి అక్బర్, ఫిషరీస్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్షుడు రజియెద్దీన్, మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు కుతుబొద్దీన్, నాయకులు విజయ్, తుక్కారాం, రహీం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలం

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్యాల: నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఉద్యమించి, సాధించుకున్న తెలంగాణలో ఉద్యమ ఆకాంక్షలు నెరవేరలేదని, దశాబ్దకాలంగా సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం మల్యాల మండలకేంద్రంలోని అంగడి బజార్ నుంచి బ్లాక్ చౌరస్తా వరకు చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు భారీ ర్యాలీ తీశారు. అనంతరం తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందించారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కారని విమర్శించారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కొత్తహామీలు ఇస్తూ, ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. మల్యాల మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, మండలాధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీవర్గీకరణకు ఉద్యమాలు ఉధృతం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సారంగాపూర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని ఎమ్మార్పీస్ జగిత్యాల జిల్లా కన్వీనర్ సురుగు శ్రీను (జగన్), ఎంఎస్పీ జగిత్యాల జిల్లా కో కన్వీనర్ బెజ్జంకి సతీశ్ అన్నారు. కోనాపూర్‌లో గురువారం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్సీవర్గీకరణ సాధనకు జూలైలో జరిగే చలో హైదరాబాద్ సభకు జూలై 6న జగిత్యాల జిల్లాకేంద్రంలో సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. దీనికి ప్రతి ఒక్కరూ తరలివచ్చి సూచనలు, సలహాలు అందించాలన్నారు. గోటూ విలేజ్ 25 రోజుల ప్రణాళికలో భాగంగా కోనాపూర్‌లో కమిటీని నియమించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మండల ఇన్‌చార్జి మీసాల చంద్రన్న, గొల్లపల్లి మండలం ఎమ్మార్పీస్ మండల ఇన్‌చార్జి తడగొండ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో జైలు

జగిత్యాలజోన్: భార్యను హతమార్చేందుకు యత్నించిన భర్తకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కంచ ప్రసాద్ గురువారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిల్ల మురళి కథనం ప్రకారం... జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్‌కు చెందిన సజ్జనపు శ్రీనివాస్‌కు 2001లో పార్వతితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఏడేళ్లుగా భార్యతో గొడవ పడుతూ శ్రీనివాస్ కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. ఈక్రమంలో భార్య,భర్తల పంచాయితీ కోర్టుకుచేరింది. దీంతో కోర్టు భర్త శ్రీనివాస్ ఉంటున్న ఇంట్లోనే భార్య పార్వతితో పాటు ఇద్దరు పిల్లలను ఉండాలని, ఇద్దరు పిల్లలతో పాటు భార్య పోషణకు నెలకు రూ.3వేలు ఇవ్వాలని శ్రీనివాస్‌ను ఆదేశించింది. కోర్టు తీర్పుతో నాలుగు నెలలు డబ్బులు చెల్లించిన శ్రీనివాస్, తర్వాత చెల్లించడం మానేశాడు. దీంతో ఇబ్బంది పడిన పార్వతి నవంబర్ 5, 2017న అదే గ్రామంలో వేరేచోట అద్దెకు ఉంటున్న భర్త శ్రీనివాస్‌ను పోషణ ఖర్చులు ఇవ్వాలని అడిగింది. దీంతో కోపోద్రిక్తుడైన శ్రీనివాస్ పక్కనే ఉన్న ఇనుప రాడ్‌తో దాడిచేయగా పార్వతి కేకలు వేసింది. చుట్టుపక్కల వారు రావడంతో శ్రీనివాస్ అక్కడినుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన పార్వతిని ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేయగా అప్పటి ఎస్సై కిరణ్‌కుమార్ కేసును దర్యాప్తు చేశారు. శ్రీనివాస్‌ను అరెస్ట్‌చేసి, కోర్టులో హాజరుపర్చగా సాక్ష్యాధారాలను పరిశీలించి శ్రీనివాస్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.